క్లుప్తంగా

'వందేభారత్'కు నేతల స్వాగతం



కొండపల్లిలో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నేతలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కొండపల్లి రైల్వే స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు, నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. కౌన్సిలర్‌లు గుంజా శ్రీనివాస్, బాడిశ నాగరాజకుమారి, మొగిలి దయాసాగర్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, మామిళ్లపల్లి ఆనంద్, కిరణ్‌కుమార్ తదితరులు జెండా ఊపి స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ట్రైన్‌కు వీడ్కోలు పలికారు. నూతన ట్రైన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కార్యాలయం ప్రారంభోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ పట్టణ మైనార్టీ విభాగం నూతన కార్యాలయం మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్ సోమవారం తెలిపారు. స్థానిక పోస్టాఫీసు సెంటర్‌లోని చారుగుండ్ల కొండ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభిస్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ముస్లిం మైనార్టీ పెద్దలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జమిందార్ సుధాకరరావు

మైలవరం: మైలవరం మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మైలవరం జమిందారు, ద్వారకా తిరుమల దేవస్థానం కమిటీ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ముస్లిమ్ పెద్దలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ముస్లిం మైనారిటీల దిన జీవిత కార్యాచరణ మరింతగా అభివృద్ధి చెందాలన్నారు. ముస్లింల కుటుంబాల్లో భగవంతుడు నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కో ఆప్షన్ సభ్యుడిగా మండలంలోని ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని సుభానీకి సూచించారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.


కూలీలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పరిపూర్ణ ట్రస్టు సభ్యులు

తిరువూరు: నాగరికతకు దూరంగా అడవుల్లో జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు తిరువూరు పరిపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు చేయూత అందిస్తున్నారు. ఖమ్మం జిల్లా తాళ్ల పెంటకు 15 కిలోమీటర్ల దూరంలో నివాసం ఉంటూ కూలి పనులు చేసి జీవిస్తున్న ఒడిశాకు చెందిన కోయతెగ కుటుంబాలకు కనీస సదుపాయాలు లేక, వైద్యసౌకర్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న పరిపూర్ణ ట్రస్టు సభ్యులు గత 2 రోజులుగా తండాలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహారం అందక అనారోగ్యం బారిన పడిన బాలలకు పండ్లు, పౌష్టికాహారం అందించారు. గిరిజన కుటుంబాలకు సంక్రాంతి సందర్భంగా అన్నదానం చేశారు. తమ ట్రస్టు తరపున కోయతెగ కుటుంబాలకు కనీస సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని ట్రస్టు వ్యవస్థాపకుడు సిరికొండ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



సువార్త సభలో ప్రసంగిస్తున్న సైమన్ సీజర్

ఆగిరిపల్లి: మండలంలోని ఈదరలో పాస్టర్ శ్యామ్యోయల్ ఆధ్వర్యంలో 63వ క్రీస్తు సువార్త మహాసభలను ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు సభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఫాదర్ సైమన్ సీజర్ క్రీస్తు మార్గం అనుసరణీయమని, క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని సందేశమిచ్చారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి

ఇబ్రహీంపట్నం: సంక్రాంతి పండుగ సంబరాలు గ్రామాల్లో ప్రజలు ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. దూరం నుంచి వచ్చిన బంధువులు, చుట్టాలతో కలసి సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్ల ముందు సంక్రాంతి ముగ్గులు వేసి గొబ్బెమ్మల వ్రతం చేశారు. బొమ్మల కొలువులు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలు తయారు చేసుకున్నారు. ఇళ్ల ముందు హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ఆటలతో పండుగ శోభ కనిపించింది. కాచవరంలో హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామిక వేత్త బోడేపూడి అప్పారావు ఈయేడాది కూడా గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 200 మందికి బహుమతులు అందజేశారు.

గంపలగూడెం: సంక్రాంతిని ఆదివారం మండలంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉయ్యాల సేరు ముగ్గులను ఆకర్షణీయంగా వేసి రంగుల దిద్దారు. ముగ్గులపై పసుపు, కుంకుమ, పూలు ఉంచి పూజలు చేశారు. గోమాతకు ప్రత్యేక పూజలు జరిపారు. గంపలగూడెం, రామాలయం, భజన మందిరం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాలు, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి, నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి సైతం కుటుంబ సమేతంగా పలువురు తమ స్వగ్రామాలకు చేరుకోవడంతో పూర్తిగా పండుగ వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు విశేషంగా పాల్గొన్నారు. సోమవారం కనుమ పండుగ సందర్భంగా పశువుల పూజలు ఘనంగా నిర్వహించారు. నెమలి ఆలయంలోని గోశాలలో గోవులకు అర్చకులు విశేష పూజలు చేశారు.

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు, కంభంపాడు, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, పోలిశెట్టిపాడు, మాధవరం, వల్లంపట్ల పలు గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. ఇండ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టారు. దూర ప్రాంతాల నుంచి బంధువులు ఇండ్లకు రావడంతో కళకళలాడాయి. ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకున్నారు. రక రకాల పిండి వంటలు వేసుకున్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

నెమలి (గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధి చెందిన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు అర్చక బృందం ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాయక స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఐదుగురు దంపతులు పీటలపై కూర్చొన్ని కన్యాదానం గావించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగ లక్ష్మణరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



కాచవరంలో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

తిరువూరు: మండలంలో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులు వేసి సంప్రదాయబద్ధంగా గొబ్బిళ్లతో అలంకరించారు. తిరువూరు సుందరయ్య కాలనీలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దేవాలయాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా విశేషపూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవేంకటాచలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ-గోదాదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మైలవరం: సంక్రాంతి పర్వదినం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి తెలిపారు. మైలవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి కనుమ ముగ్గుల పోటీలు సోమవారం నిర్వహించారు. మహిళలు సంక్రాంతి పండుగను సూచిస్తూ ముగ్గులు పోటీలు నిర్వహించడం శుభప్రదమన్నారు. మైలవరం ప్రజల లోగిళ్లు భోగభాగ్యాలతో, శిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. పోటీల విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ, కాన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మహిళా సభ్యులు, సంఘం నాయకులు కాజా మహేష్, బి.శ్రీనివాసరావు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం కనుమ పండుగను సంప్రదాయకంగా జరుపుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన బంధువులతో కుటుంబ సమేతంగా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా కనుమ రోజున ఎక్కువ మంది మాంసాహార భోజనాలు భుజించారు. పలు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. వచ్చిన బంధువులు మూడు రోజుల పాటు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపి తమ ప్రాంతాలకు తిరుగు ప్రయాణాలు మొదలు పెట్టారు.

ఆగిరిపల్లి: మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు సంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గ్రామాలు బంధువుల రాకలతో కళకళలాడాయి. పలు గ్రామాల్లో సంప్రదాయ బద్ధంగా కోడి పందేలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు కోడి పందేలను చూడడానికి మక్కువ చూపించారు.

ఆగిరిపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ఎస్ఐ చంటిబాబు చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను తరుణ్, శిరీష, దివ్యశ్రీలకు అందజేశారు.

విస్సన్నపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీ నర్మదానగర్‌లో ముగ్గుల పోటీలు, ఆడపడుచులకు ఆటల పోటీలు, చిన్నారులతో నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామంలో యువకులు క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. విజేతలకు బహుమతులను వైఎస్సార్ సీపీ బీసీసెల్ మండల అధ్యక్షుడు పంతంగి రమేష్ అందజేశారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



గంపలగూడెం మండలం నెమలిలో గోమాతకు పూజలు



నెమలిలో గోదాదేవి కల్యాణం



తిరువూరు సుందరయ్య కాలనీలో ముగ్గుల పోటీలు



తిరువూరు శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ-గోదాదేవి కల్యాణంలో భక్తులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ చంటిబాబు

శేషాచలస్వామిని దర్శించుకున్న ఏసీపీ



ఏసీపీకి స్వామి చిత్ర పటం అందజేస్తున్న చైర్మన్

మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై శేషాచల శ్రీనివాసస్వామిని మైలవరం ఏసీపీ ఎం.రమేష్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనను అర్చకులు తూమాటి శ్యామ సుందరాచార్యులు సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజలు పాల్గొన్న అనంతరం ఏసీపీకి స్వామి చిత్ర పటం శేషావస్త్రాలను ఆలయ చైర్మన్ జే.ప్రతాపరెడ్డి అందజేశారు. ఎస్ఐ వి.సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి రంగనాయకస్వామి కల్యాణం

మైలవరం: మైలవరంలోని శ్రీద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ గోదాదేవి సమేత శ్రీ రంగనాయలు మహాలక్ష్మీ వార్ల కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. ద్వారకా తిరుమల దేవస్థాన కమిటీ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తనయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నప్రసాద వినియోగం జరిగింది.

అన్నదానానికి సహకరించాలని వినతి

ఆగిరిపల్లి: జిల్లాలోని ఆగిరిపల్లిలోని శ్రీశోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి భక్తులు విరాళాలు అందించాలని ఆలయ ఈవో నాగిరెడ్డి భవాని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22 నుంచి 30 వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా 29వ తేదీన అన్నదాన కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి విరాళాలు అందించాలనుకునే భక్తులు ఆగిరిపల్లి యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్: 000312010001353కు, ఐఎఫ్ఎస్సీ కోడ్ యుబిఐఎన్ 0800031 ద్వారా జమ చేయవచ్చని తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడి



పేకాట శిబిరం ఖాళీ చేయించిన ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట, గుండాట శిబిరాలపై ఇబ్రహీంపట్నం సీఐ పి.శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడిచేశారు. కోడి పందేలు, పేకాట, గుండాట శిబిరాలు నిర్వహిస్తే సహించమని హెచ్చరించారు. శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన పేకాట, గుండాట టెంట్లు కూల్చివేశారు. పేకాట నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్ఐలు శ్రీనివాస్, పాపారావు, సిబ్బంది దాడిచేసిన వారిలో ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



వ్యక్తిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దయాసాగర్, ఆర్పీఎఫ్ పోలీసులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడిన వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రరక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. కొండపల్లి మున్సిపాల్టీ 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ ఆర్పీఎఫ్ పోలీసులు, రైల్వే సిబ్బంది సహకారంతో 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఆదిలాబాద్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మాయావతి జన్మదిన వేడుకలు

నందిగామ: స్థానికంగా బహుజన సేవాసమితి(బీఎస్ఎస్) ఆధ్వర్యాన బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షురాలు మాయావతి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బహుజనుల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి సూర్యం, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్, స్నేహ క్లబ్ గవర్నర్ కె.జెడ్.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జోగి రమేష్ జన్మదిన వేడుక



ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మంత్రి జోగి రమేష్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జన్మదిన వేడుకలు ఇబ్రహీంపట్నంలోని ఆయన స్వగృహంలో బంధు మిత్రులు, పార్టీ నాయకుల కోలాహలం మధ్య ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, కుటుంబ సభ్యులతో కలసి కేక్ కట్ చేశారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని దీవెనలు అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, మాజీ సర్పంచి జోగి నాగమణి, సీఐ పి.శ్రీను, పోలీస్ సిబ్బంది, కొండపల్లి మున్సిపాల్టీ వార్డు కౌన్సిలర్లు, వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ మంత్రి జోగి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే పార్థసారథికి పరామర్శ



ఎమ్మెల్యే పార్థసారథిని పరామర్శిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య మృతి తీరని లోటని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేపీ రెడ్డయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే సోమవారం నివాళులర్పించారు. అనంతరం రెడ్డయ్య కుమారుడు పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథిని పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



సుబ్బారావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఆర్యవైశ్య ప్రముఖుడు కొత్తూరు సుబ్బారావు సోమవారం వైఎస్సార్సీపీలో చేరారు. ఎమ్మెల్యే కె.రక్షణనిధి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని సుబ్బారావు పేర్కొన్నారు. నడిం తిరువూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గజ్జల సీతారామారావు, శ్రీవేంకటాచలస్వామి దేవస్థాన ఎండోమెంట్ కమిటీ చైర్మన్ అనుమోలు ముత్తారావు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు దేవిశెట్టి బాలకృష్ణ ఆయనను అభినందించారు.

హేతువాద సాహిత్యం విస్తృతం కావాలి



సుబ్బరాజు సంకలనపరచిన మానవవాద గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: హేతువాద సాహిత్యం విస్తృతంకావాలని ప్రజా సాహితి సంస్థ అధ్యక్షుడు దివి కుమార్ అన్నారు. త్రిపురనేని స్మారక సంస్థ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కవి, పరిశోధకుడు బహుభాషా వేత్త త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దివి కుమార్ మాట్లాడుతూ మహిళలోని ఎదుగుదలను స్వాగతించాల్సిన అవసముందన్నారు. సమాజంలోని మూఢాచారాలను ఖండించాలని సూచించారు. శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకుడు సింగంశెట్టి అశోక్ కుమార్ మాట్లాడుతూ కవిగా ఆయన సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు చేశారన్నారు. తెనాలి మున్సిపల్ చైర్మన్‌గా, న్యాయవాదిగా ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. హేతువాది పెన్మెచ్చ సుబ్బరాజు సంకలన పరచిన వ్యాస సంపుటి మానవ వాద మార్గం గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు ఎం.అరుణ్ కుమార్, గోళ్ల నారాయణరావు, జంపాల కృష్ణ కిషోర్, పూర్ణెందు చంద్రమౌళి, మందగళ్ల సాయికుమార్, కోడాలి రవిబాబు, అరుణాచలం పాల్గొన్నారు.

మహిళా సహకార బ్యాంక్ పాలకవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యుల ఎన్నిక పక్రియ నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి కోటేశ్వరరావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీ శారదాంబ మహిళా సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి వైవీ కోటేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఉత్తర్వులు మేరకు సోమవారం సత్యనారాయణపురంలోని ప్రశాంతి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కుసుమ లావణ్య, వైస్ చైర్మన్‌గా అమూల్య కల్పన, డైరెక్టర్లుగా అపర్ణ, వి.నాగమణి, కె.లక్ష్మీకుమారి, ఎం.జ్ఞానాంబ, పి.రాధికను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నిక అయిన సభ్యులు నేటి నుంచి ఐదు సంవత్సరాల పాటు తమ సేవలను కొనసాగించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి కోటేశ్వరరావు, బ్యాంకు సీఈఓ పి.ప్రభాకర్ ఎన్నికైన సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది నూతక కార్యవర్గ సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళల్లో వెల్లివిరిసిన సృజనాత్మకత



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులందిస్తున్న ఆదిలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లుల్లో సృజనాత్మకత వెల్లివిరిసిందని, మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ ఆకృతుల్లో వేసిన ముగ్గులు ఆకర్షణీయంగా ఉన్నాయని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తలూరి ఆదిలక్ష్మి అన్నారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు చిచ్చా బ్రదర్స్ ఆధ్వర్యంలో 48వ డివిజన్‌లో మూడు రోజులపాటు ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా కొనసాగిస్తున్న మహిళలు అభినందనీయులన్నారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు కార్పొరేటర్ ఆదిలక్ష్మి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిళ్లా జగ్గు, శీరం వెంకట్రావు, అయితా కృష్ణకిషోర్, కోళ్ల రజని, అత్తలూరి పెదబాబు, లక్ష్మి, వరలక్ష్మి, దుర్గారావు, బాయన అమర్‌నాథ్, నాగు, ఆర్ శ్రీను, ముస్తఫా పాల్గొన్నారు.

ముగిసిన వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ



క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ నాకౌట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలోని షాదీఖానా మైదానంలో సంక్రాంతి సందర్భంగా వెలంపల్లి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ నాకౌట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నెల 10న ప్రారంభమైన టోర్నమెంట్ సంక్రాంతి రోజున ముగిసింది. ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా ఈశ్వర్ సీసీ, సత్తార్ సీసీ జట్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు నిర్ణయించారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఏటా సంక్రాతికి ఈ పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర, ఆర్గనైజర్స్ డీవీ రెడ్డి, శ్రీకాంత్, ప్రభాకర్, కేసరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో ఆటల పోటీలు నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు ఎస్.సుబ్బారెడ్డి భవానీపురం బ్యాంక్ సెంటర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు లెమన్ అండ్ స్పూన్, సైకిల్, రన్నింగ్ వంటి వివిధ పోటీలు జరిగాయి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోకూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ నాయకులు బీఏ రావు, ఎం.మురళి, అచ్చేశ్వరరావు, ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్షురాలు కుండనాల శేషుమణి, విక్రం లక్ష్మి, పీఎస్ఎం నాయకులు పీ అప్పన్న, కె రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.